31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
బుధవారం 17 సెప్టెంబర్ 2025 పేజీలు : 8

## హత్య కేసులో నిందితుల అరెస్టు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16:** జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస-గుల్లపేట సమీపంలో సోమవారం జగిత్యాల పట్టణానికి చెందిన నయీమోద్దీన్ అనే ఆటో డ్రైవర్ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ తెలిపారు. మంగళవారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన దర్శన్ సాహ్నీ, సునీల్ సాహ్నీ అనే కూలీలు నయిమోద్దీన్ ఆటోలో మూడు వందలకు అద్దెకు మాట్లాడుకుని వెళ్లారని, అద్దె విషయంలో గొడవ రావటంతో గుడ్డతో మెడకు ఉరి వేసి ఆ తర్వాత బండతో మోదీ హత్య చేసినట్లు తెలిపారు. నిందితులైన దర్శన్ సాహ్నీ, సునీల్ సాహ్నీలను



రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ సధాకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చట్ట రీత్యా నేరం

- ర్యాగింగ్ వల్ల భవిష్యత్తు నాశనం అవుతుంది
- ఉత్తమ విద్యార్థులుగా ఎదిగి జిల్లా నర్సింగ్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి
- ఎస్పీ అశోక్ కుమార్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16:** ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని, ర్యాగింగ్ వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఉత్తమ విద్యార్థులుగా ఎదిగి జిల్లా నర్సింగ్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలపై మంగళవారం ఐఎంఏ హాల్ లో అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా జిల్లా




ఎస్పీ అశోక్ కుమార్ హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడకూడదని, అలా జరిగితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని, ఒకరికి ఒకరు సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. సీనియర్లు జూనియర్లకు ప్రోత్సాహం, మార్గనిర్దేశం చేయాలని కానీ భయపెట్టరాదని సూచించారు. ర్యాగింగ్ చేయడం ఒక పెద్ద నేరమని, అది బాధిత విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ర్యాగింగ్ చేయడం వల్ల ఎంతోమంది విద్యార్థులు తమ చదువు, భవిష్యత్తు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు జగిత్యాల జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని స్పష్టం చేశారు. ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం ర్యాగింగ్‌లో పాల్గొన్న విద్యార్థులపై క్రిమినల్ కేసులు, జైలు శిక్ష, కాలేజీ నుండి బహిష్కరణ, స్కాలర్షిప్ రద్దు, ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం వంటి తీవ్ర శిక్షలు తప్పవని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రాంగణం సురక్షితంగా ఉండేందుకు ప్రతి విద్యార్థి సహకరించాలని, ర్యాగింగ్ అనే దుష్ప్రవర్తనకు చెక్ పెట్టి స్నేహపూర్వక వాతావరణంలో చదువు కొనసాగించాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్ బాధితులుగా మారితే ఎలాంటి భయం లేకుండా వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ లు ఏర్పాటు చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులను ప్రశ్నలు అడిగి ర్యాగింగ్ వల్ల కలిగే పరిణామాలపై అవగాహనను పరీక్షించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ రాజ్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



### విద్యార్థులకు మెనూ ప్రకారం
## భోజనం అందించాలి

- ఖాళీ సీట్ల భర్తీకి అధ్యాపకులు చొరవ తీసుకోవాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఖాళీ సీట్ల భర్తీకి అధ్యాపకులు చొరవ తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశా లను మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని ప్రస్తుతం ప్రతి రోజు అందించే మెనూ ఎలా ఉంటుందని విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

-2లో

## యూరియా కొరతకు కేంద్రమే కారణం

- ఇప్పటికే బిజెపి ఎంపీలు ఈ విషయం ఒప్పుకున్నారు
- కాంగ్రెస్ నేత ఒడితల ప్రణవ్
- ఈటెల రాజేందర్ వ్యాఖ్యలను ఖండించిన ప్రణవ్
- హుజురాబాద్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 16 :** యూరియా విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, యూరియా పాపం కేంద్ర ప్రభుత్వానిదేనని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్





అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ. 54,31,500/- విలువ చేసే 147 చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రాలకు యూరియా సరఫరాచేసేది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ ఎంపీలే చెప్పారని దానికి విరుద్ధంగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని ఆయన ఖండించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కూడా యూరియా కొరత ఉందని దానికి ఈటెల రాజేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రణాళికబద్దంగా యూరియా సరఫరా కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, ఇప్పుడు కూడా పంపామని

### ప్రజలకు వైద్య సేవలు అందించడంలో
## నిర్లక్ష్యం వహించరాదు

- సిబ్బంది సమయపాలన పాటించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- పెద్దలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని విభాగాలు, వార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, రిజిస్టర్, ఫార్మసీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల తీరుపై ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలు సుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లా డారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో

-2లో

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రాచర్ల గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులు







**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈరోజు వారధి ఫౌండేషన్ వారు ఇంగ్లీష్ సబ్జెక్టులో మండల స్థాయిలో ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ మరియు డిబేట్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. ఇట్టి కాంపిటీషన్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచర్ల గొల్లపల్లి విద్యార్థులు ఎస్సే రైటింగ్ లో ఎల్. త్రిపుర, డి. చేతన, డిబేట్ కాంపిటీషన్లో వి. సాయి సహస్ర, జి .త్రివేన్ రెడ్డి ,ఎం. సహస్ర మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. మురళీధర్ గారు మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆశీర్వదించారు.

## గొర్రె పిల్ల దొంగతనం కేసు నమోదు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 16 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో గొర్రె పిల్ల దొంగతనం జరిగిందని గొర్రె బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాహుల్ రెడ్డి కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గొర్లమందకు వెళ్లి చూడగా అందులో 6000 రూపాయల గల ఒక గొర్రె పిల్ల కనిపించలేదని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రె పిల్లని దొంగలించారని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం...

**మొదటి పేజీ తరువాయి...**ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ అత్యధిక నిధులు మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీలు 40శాతం పెంచడం జరిగిందన్నారు. గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు 100 శాతం పూర్తి అయ్యేవిధంగా అధ్యాపకులు చొరవ తీసుకోవాలని తెలిపారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వచ్చే ప్రయత్నం చేస్తానని, పాఠశాలలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వంముఖ్యమంతి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చల్గల్ లో 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం,అడువల జ్యోతి లక్ష్మణ్,మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్, ఇంచార్జి ప్రిన్సిపాల్ రవి, ముకీమ్, నాజిం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతకు కేంద్రమే కారణం

**మొదటి పేజీ తరువాయి...** కేంద్రం నుండి రావాల్సిన యూరియా ఇవ్వలేదని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకుడు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూరియా విషయంలో పిట్ట కథలు చెప్తున్నారని, వారి మాటలు చూస్తే బీజేపి, బిఆర్ఎస్ ములాఖత్ బయటపడుతుందని విమర్శించారు. కాళేశ్వరం విషయంలో చిన్న స్థాయి ఉద్యోగి దగ్గరే వందల కోట్లు దొరికితే ప్రాజెక్ట్ రూపకర్త అని చెప్పే కేసీఆర్, కేటీఆర్ దగ్గర ఇంకా ఎన్ని కోట్లు దొరుకుతాయని ప్రశ్నించారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని దానికి అనుగుణంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇప్పటికే కేంద్రానికి లేఖలు రాశారని 50వేల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చుకున్నారని మళ్ళీ యూరియా కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. రైతుల విషయంలో బిఆర్ఎస్, బీజేపీ చేస్తున్న రాజకీయం కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోదని రాజకీయాల కంటే రైతుల సంక్షేమం ప్రయోజనమే మాకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజలకు వైద్య సేవలు అందించడంలో

# నిర్లక్ష్యం వహించరాదు

**మొదటి పేజీ తరువాయి...**ఉండాలని, సిబ్బంది సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అందుబాటులో లేని సిబ్బంది పట్ల తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.గ్యాస్ స్టవ్ పైనే మధ్యాహ్న భోజనం తయారుచేయాలి.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీలో కలెక్టర్ పెద్దలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు? అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.తరగతి గదులను సందర్శించి, ఎన్ని ఎల్ఈడీ ప్యానెల్స్ వివరాలను ఆరా తీశారు. తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌలపై మాత్రమే తయారు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టీ బోధించాలని తెలిపారు.

## రాజకీయ స్వార్ధం కోసమే శ్రీపాద రావును అవమానిస్తున్న పుట్ట మధు

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మహిళా కాంగ్రెస్ నాయకులు




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (కాటారం )సెప్టెంబర్ 16.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో కాటారం డివిజన్ పరిధిలోని మండలాల మహిళా కాంగ్రెస్ నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దిష్టిబొమ్మ దగ్నం చేశారు, అనంతరం పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, రాజకీయంగా మంత్రి శ్రీధర్ బాబుని ఎదుర్కోలేక వారి తండ్రి శ్రీపాద రావు పైన ఇష్టానుసారంగా పుట్ట మధు మాట్లాడుతున్నాడని, ఇది కేవలం రాజకీయ స్వలాభం కోసం అజాతశత్రువు అయినటువంటి ఆ మహనీయుడు మీద నిందలు వేయడం సరికాదని, స్వర్గీయ శ్రీపాద రావు నిన్ను చేరదీసి రాజకీయ ఓణమాలు దిద్దించి రాజకీయంగా ప్రోత్సాహం అందించిన ఆ మహనీయుని మీద సంస్కారహీనంగా తప్పుడు ప్రచారాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాల్సిందిగా తెలిపారు, మంథని నియోజకవర్గం నుండి మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి మారుమూల ప్రాంతాన్ని అభివృద్ధి పరిచిన ఘనతా శ్రీపాద రావుదని,అలాంటి మహనీయుని గుర్తుగా విగ్రహాలు ఏర్పాటు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు, శ్రీపాద రావును రాజకీయంగా వాడుకొని మంత్రి శ్రీధర్ బాబుకు వెన్నుపోటు పొడిచి నేడు రాజకీయ స్వలాభం కోసం అజాతశత్రువు అయినటువంటి శ్రీపాద రావు విగ్రహాలను ధ్వంసం చేస్తానని ప్రకటన చేయడానికి సిగ్గుండాలని, నువ్వు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఏనాడు గుర్తుకు రాని బహుజన వాదం కేవలం ఇప్పుడు రాజకీయంగా బహుజన వాదాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయాలి అనుకుంటున్నావు, మంథని నియోజకవర్గం లో నువ్వు దళితుల పట్ల చేసిన అన్యాయాలని ప్రజలు ఇంకా మరిచిపోలేదని, నడి రోడ్డుమీద లాయర్ల దంపతుల హత్యలో ప్రధానంగా వినిపించే పేరు నిదేనని ఈ కేసు సుప్రీంకోర్టు సిబిఐ విచారణ చేపట్టాలని తీర్పు ఇవ్వడం తో మతి భ్రమించి మాట్లాడుతున్నావని,ప్రత్యక్షంగా పరోక్షంగా మంథని నియోజకవర్గం లో పలువురి దళితుల హత్యలకు కరకునివి నువ్వు అలాంటి నువ్వు మా నాయకులు శ్రీపాద రావు గురించి పదే పదే నోటికి వచ్చింది వగితే మా మహిహ కాంగ్రెస్ సైన్యం నీ అంతు చూసేదాకా వదిలిపెట్టమని హెచ్చరించారు, నీ ఉనిక కాపాడుకోవాలనుకుంటే ప్రజలకి మంచి చేయాలి కానీ ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే ఆ ప్రజలే నిన్ను రాజకీయంగా సమాధి చేస్తారని, మరోసారి ఇలాంటి చిల్లర ఆరోపణలు మానుకోకుంటే నువ్వు ఎక్కడికి వెళ్తే అక్కడ మా మహిళా కాంగ్రెస్ శక్తి నిన్ను అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, మాజీ ఎంపీపీ రాణిబాయి, సత్యమ్మ,మాజీ జడ్పీటీసీ లు అరుణ, శారదా, రాజమ్మ, మహేశ్వరి, స్వప్న, మహిళా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## గంజాయి స్వాధీనం

### ఇద్దరు వ్యక్తుల అరెస్టు



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 16 :**జగిత్యాల కొత్త బస్టాండ్ లో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించగా వారి వద్ద 200 గ్రాముల బరువు గల గంజాయి లభ్యమైందని జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. నిందితులను జగిత్యాల టౌన్ పిఎస్ తరలించినట్లు పేర్కొన్నారు. కుమ్మరపల్లి మండలం కొస సముద్రం, నిజాంబాద్ జిల్లాకు చెందిన తిరుపతి, బుగ్గారం మండలం వెలుగొండ కు చెందిన ఇట్టెం రాహుల్ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు



**చెన్నూరు సెప్టెంబర్ 16(చురకలు):** చెన్నూర్ నియోజకవర్గం పట్టణాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు చెన్నూర్ లో మంత్రి పర్యటించారు. మార్నింగ్ వాక్లో భాగంగా పలు వార్డుల్లో ఆయన పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. చెన్నూరు పట్టణంలో రూ.30కోట్లతో అమృత్ పథకం ద్వారా కాలేజ్ గ్రౌండ్, మార్కెట్లో చేపట్టిన వాటర్ ట్యాబ్లు, తహసీల్దార్ ఆఫీస్ వెనుక నిర్మిస్తున్న అంబేద్కర్ భవన పనులను మంత్రి పరిశీలించారు వివిధ వార్డుల్లో రోడ్లు, సైడ్ డ్రైన్ పనులను పరిశీలించి పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. చెన్నూరు మండలం కిష్టంపేట ఎస్సీ కాలనీలో వేసిన బోర్వెల్ ని మంత్రి ప్రారం భించారు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబాలను మంత్రి పరామర్శించారు అనంతరం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో కోటపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులతో మంత్రి వివేక్ సమావేశం నిర్వహించారు గ్రామా ల్లో నెలకొన్న సమస్యలు. అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నాయ కులకు కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

# ఇందిరమ్మ రాజ్యంలో విద్య కోసం ఇక్కట్లా?

**విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**
**-మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16 :** ఇందిరమ్మ రాజ్యంలో విద్యార్థులు విద్య కొసం ఇక్కట్లు పడడం శోచనీయం అని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలతో ఊపందుకోని, రాష్ట్రం సాధించే వరకు పోరాటం చేసినా విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష, నిర్లక్ష్యం చూపడం సబబు కాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామని పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ మాటను మర్చిందన్నారు. యాజమాన్యాలు పోరాటం చేసినప్పు డల్లా అధికారం అడ్డుపెట్టుకొని యాజ మాన్యంలను బెదిరించడం ప్రభుత్వం కు పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు.విద్యా,వైద్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని, వాటి ని సక్రమంగా అందించడం ప్రభుత్వ బాధ్యత అని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తు ఎరుగాలన్నారు.ఇందిరమ్మ రాజ్యం తెస్తామని బూటకపు మాటలతో గద్దెనెక్కిన ప్రభుత్వం,అధికారంలోకి వచ్చాక నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని ఆరోపించారు.గత మూడేళ్లుగా ఎంటిఎఫ్,రియాంబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్లో ఉండడంతో యాజమాన్యలు సైతం ఆర్థికంగా చిక్కిశల్యం అవుతున్నాయ న్నారు.నిర్వహణ భారమై ఇప్పటికే అనేక కళాశాలలు మూత పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యలు పోరాటం చేస్తామన్నా ప్రతిసారి ఎదో రూపంలో ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం, బకాయిలు విడుదల చేస్తామని మభ్య పెట్టడం తర్వాత ఇచ్చిన హామీని విస్మరించడం పరిపాటిగా మారింద న్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో యాజమాన్యం లు పడుతున్న ఇబ్బందులు,వాటి వల్ల విద్యార్థులపై పడుతున్న ప్రభావంను దృష్టిలో ఉంచు కొని ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16 :** ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణిలో విధులు నిర్వహిస్తున్న జగిత్యాల టౌన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ని మెట్పల్లి మండలం జక్కసాగర్ గ్రామానికి చెందిన పల్లికొండ ప్రవీణ్ జిల్లా అనే వ్యక్తితో పాటు మరి కొంతమంది కలిసి కలెక్టరేట్ గేటు లోపటికి చొచ్చుకు వచ్చి తమ చెరువులు తమకే కావాలని నినాదాలు చేస్తూ చెరువులపై తమకు హక్కులు కల్పించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని భయంభ్రాంతులకు గురి చేసినట్లు తెలిపారు. ఎవరికి కనపడకుండా వారి వెంట తెచ్చుకున్న పెట్రోల్ మీద పోసుకుని చనిపోతామని బెదిరిస్తూ అడ్డుకోవడానికి వెళ్లిన పోలీస్ సిబ్బంది పైన కూడా పెట్రోల్ పడడంతో అక్రమంగా కలెక్టరేట్ లోపటికి ప్రవేశించి అధికారులను భయాందోళనకు గురి చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తులపై జగిత్యాల టౌన్ కానిస్టేబుల్ విజయేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ సబ్ఇన్స్పెక్టర్ కే. కుమారస్వామి కేసు నమోదు చేసినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ వెల్లడించారు. ఇకముందు ఎవరైనా వ్యక్తులు ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే వారి పైన కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని టౌన్ సీఐ హెచ్చరించారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 16 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిం చాలని భారతీయ జనతా పార్టీ ధర్మపురి పట్టణ, మండల అధ్యక్షులు గాజు భాస్కర్ ,కుమ్మరి తిరుపతి లు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీ చౌక్ వద్ద తెలంగాణ విమోచన దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు గాజుభాస్కర్ ,కుమ్మరి తిరుపతి మాట్లాడుతూ 1947 లో దేశానికి స్వతంత్రం వచ్చినా తెలం గాణ విముక్తి పొందలేదన్నారు.1948 లో నైజామ్ పాలకుల నుంచి విముక్తి పొంది దేశంలో విలీనమైన నాటివరకు నిజాం పాలకులు,కాసీం రజ్వి తెలం గాణ ప్రజలను చిత్ర హింసలు పెట్టార న్నారు. అప్పటి కేంద్ర హెూం శాఖ మంత్రి సర్దార్ వల్ల భాయ్ పటేల్ సైనిక చర్యతో తెలంగాణ కు విమోచనం దొరికిందన్నారు. ఆనాటి నిజాం పాలకుల దుస్ట పాలన నుంచి విముక్తి పొందిన రోజు సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బిజెపి పార్టీ తెలంగాణ ప్రజల తరపున ప్రభుత్వాలను కోరుతు న్నట్లు, తెలంగాణలో ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని నిర్వహించ లేదన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్, ప్రధాన కార్యదర్శులు తిర్మాంధస్ సత్యనారా యణ,సంగి మాధవ్,కామేర ప్రభాకర్, జెల్ల వినోద్,కిరణ్,సుంకు మధు సుధన్,బండారి గణేష్,కాసెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధుల మంజూరి



**-రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్**

**చురకలు,విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 16 :** ధర్మపురి నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం, 5 కోట్ల 20 లక్షల నిధులుమంజూరి అయినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ తెలిపారు.ధర్మారం తెనుగువాడ నుండి ఎండపల్లి క్రాస్ రోడ్ ( కొత్తపల్లి బీటీ రోడ్డు నుండి ఎండపల్లి బీటీ రోడ్డు ) ధర్మారం మండలం పెద్దపల్లి జిల్లా కు రూ.3కోట్ల 20లక్షలు అలాగే జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజక వర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ బ్రిడ్జి రోడ్డు నుండి పందుల గుట్ట, మద్దుల పల్లి గ్రామం మండలం పెగడపల్లి కిరూ. 2 కోట్లు,మంజూరైనట్లు తెలిపారు.నిధులు మంజూరి చేసి నియోజ కవర్గ అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజ కవర్గంలో ప్రతి గ్రామం అభి వృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందన్నారు.

## మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వ హెల్త్ క్యాంపులు




**చురకలు,విలేఖరి,వెల్గటూర్, సెప్టెంబర్ 16 :** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల ఆరోగ్య పరిర క్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ (ఎస్,ఎన్,ఎస్,పి,ఏ) పథకం ద్వారా జిల్లాలో హెల్త్ క్యాంపుల నిర్వాహన ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జరుగు తుందని, దీనిలో భాగంగా వెల్గటూర్ ఉమ్మడి మండలం అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఈ నెల 17, 22,26 తేదీల్లో, వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 18, 26,అక్టోబర్ 1న ప్రత్యేక వైద్య అధికారులతో మహిళలకు ఆరోగ్య పరీక్షల కోసం ప్రభుత్వం ఉచిత వైద్య క్యాంపులు నిర్వ హించనున్నట్లు పి ఎచ్ సి వైద్య అధికారులు తెలిపారు.ఇట్టి క్యాంపుల ను వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబారిపేట లోతేది,17న,చెవి,ముక్కు,గొంతు,22 న,గైనకాలాజి, 26 న, జనరల్ పరీక్షలు, వెల్గటూర్ లో తేది 18న,కంటి పరీక్షలు, 26న, చర్మవ్యాది, అక్టోబర్1 న, పిల్లల కు పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి లవకుమార్ తెలిపారు.

## చందయ్యపల్లెలో ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులు పూర్తి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 16 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని చందయ్యపల్లెలో ఇందిరమ్మ ఇళ్ళు స్లాబ్ పనులు పూర్తయ్యాయి. చందయ్యపల్లెలో మంజూరైనా మ్యాకల చిలుకమ్మ ఇందిరమ్మ ఇళ్ళు పనులు తొందరగా జరుగుతుండగా మంగళవారం స్లాబ్ పనులు ప్రారంభించి పూర్తి చేశారు. బుగ్గారం మండలంలో 155 ఇందిరమ్మ ఇళ్ళు పనులు ప్రారంభంకాగా చందయ్యాపల్లెలో మ్యాకల చిలుకమ్మ ఇళ్ళు మండలంలోనే మొట్టమొదటి ఇళ్ళు స్లాబ్ వేయగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ నిర్మాణ పను లను పరిశీలించి లబ్దిదారు చిలుకమ్మను అభినందించారు.సుభాష్ వెంట మం డల పార్టీ ఉపాధ్యక్షులు నాగునూరి నర్సాగౌడ్, మాజీ సర్పంచులు ఎన్నం కిషన్ రెడ్డి, కొండపల్లి సంతోష్రావు,తాండ్ర సత్యనారాయణ రావు,కాంగ్రెస్ నాయకులు గట్టు గంగారం,రాచర్ల మల్లయ్య, చల్ల తిరుపతి,గాదే శంకర్, చుక్క సుధాకర్, కలమడుగు పోచయ్య, మ్యాకల వెంకటేష్, బియ్యాల రాయమల్లు, మ్యాకల ధర్మయ్య, బియ్యల కొమురయ్య, గడ్డం మహేష్, నరేష్ తదితరులున్నారు.

## మాజీ మంత్రి పరామర్శ



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 16 :** ధర్మపురి పట్టణానికి చెందిన వీరవేణి రాజ్ కుమార్ ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుల తో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ముఖ్యమంత్రి వెంట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, ఆనంతుల విజయలక్ష్మి లక్ష్మణ్, సంగి శేఖర్,జెట్టి రాజన్న, సంగి శ్రీనివాస్, బండారు రంజిత్, మోలుగురి ప్రశాంత్,లడ్డు తదితరులున్నారు.

# సంప్రదాయ రీతిలో ఉట్ల పండుగ

**రామ కిష్టయ్య సంగన భట్ల**

ధర్మపురి క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలలో భాగంగా మంగళవారం సాయంత్రం ఉట్ల పండగ వేడుకల కార్యక్రమాన్ని దేవ స్థానం పక్షాన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మదిన సందర్భంగా యాదవులు ఆనందోత్సాహాల మధ్య శ్రీకృష్ణుడు జన్మించిన నేపథ్యంలో గోకులంలో అలనాడు జరుపుకున్న పండగను, అనాదిగా వారసత్వ సాంప్రదాయాచరణ క్రమంలో మంగళవారం సాయంత్రం భక్తజన సమక్షంలో ఘనంగా జరిపారు.



**ప్రాచీన చారిత్రిక సాక్ష్యం... ఇసుకస్థంభ మంటపం**

ఉత్సవాన్ని నిర్వహించే సత్యవతీ దేవాలయ అనుబంధమైన మంటపం, దేవాలయ ప్రాచీన విజయ స్తంభం, పశ్చిమ చాళుక్యుల నాటివి. కనుక ఈ ఆలయము 11వ శతాబ్దికి ముందు నిర్మితమైనదిగా భావించ బడుతున్నందున, దీనికి అనుబంధమైన మంటపము ఆకాలము నా టిదేనని భావన. ఇది శిథిలమై పునర్నిర్మాణం 16వ శతాబ్దంలో చేయబడినట్లు స్పష్టమగు చున్నది. ఈ మంటపము దేవాలయాల ప్రాంగణము లోని ప్రవేశ భాగమున ఉండుటచే, చారిత్రిక ప్రాధాన్యతో బాటు ప్రధానాల యాల ఉత్సవ విధులలో ప్రధాన స్థలంగా ఉన్నది. శతాబ్దాలుగా ఉట్ల పండుగను ఈ ప్రదేశంలోనే నిర్వహించడం అనవాయితీగా వస్తున్నది. దేవస్థానం నుండి బయలు దేరిన స్వాముల ఉత్సవ మూర్తుల ఊరేగింపు సేవలు బ్రహ్మ పుష్కరిణిని దాటి ఈ మంటపానికి రావడం క్షేత్ర సనాతన ఆచారం. మంటపంలో స్వాముల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, విశ్రమింపజేసి, స్వాముల కెదురుగా వేద సదస్సు నిర్వహించడం క్షేత్ర సాంప్రదాయం. క్షేత్రంల ని ఇతర నరసింహా లయాలు పునర్నిర్మాణాలు జరుగుటకు ముందు, సత్యవతీ దేవాల యస్థ నరసింహ స్వామికే కైంకర్యాదులను జరుపుటచే ఈ మంటప ప్రాముఖ్యత ఇనుమడించింది. సత్యవతీ దేవాలయం ముందు భాగాన, ఆలయం ఎత్తుకు 6అడుగుల దిగువగా, రోడుకు 2 అడుగుల ఎత్తుగా ఉన్న మంటపం లోని అడుగున పరిచిన రాయి ఉలి ఒరిపిళ్ళకు, ఉరి నైశిత్యానికి నూరిన గుంటలతో ఉన్నందున ఆలయ శిల్పులు ఈ మంటపమును విశ్రాంతి కేంద్రముగా చేసుకుని నిర్మాణాదులను గావించారని తెలుస్తున్నదని, అంతేగాక రెండవ దశలోని ఆలయము నకు ఇది పూర్వ పుదని, అంటే 400 సంవత్సరాలకు పూర్వముదని భావించ వీలగునని స్థానికులు, చారిత్రక పరిశోధకులు డాక్టర్ ఎస్. నర్సయ్య పరిశోధనల వల్ల తెలుస్తున్నది. ఈ మంట పము నందు తొమ్మిది స్థంభము లున్నాయి. వీటితో కప్పు పై భాగం మొత్తం మంటనికిగాక, కొంత భాగము నకే ఆచ్ఛాదింప బడుచున్నది. 9 స్థంభములలో 4 స్థంభాలు అపు రూపమైన శిల్పకళతో అలరారడం వలన, ఇవి ప్రాచీనాలయ మంటప సంభాలుగా భావించ వచ్చు. ఆలయం శిధిలమైన పిదప వీటిని తీసికొని పునర్నిర్మా ణంలో మంటపాన్ని కట్టారని చెప్పవచ్చు. ఇది అనంతర నిర్మాణమనుటకు సాక్ష్యం. మిగిలిన స్థంభాలు శిల్పము లేని, మందము తక్కువగల నాసిరకం ఎర్ర రాయితో ఉండడం. ప్రాచీన స్థంభ చతుష్టయము పశ్చిమ చాళుక్య లేదా కాకతీయ శిల్ప రీతిని కలిగి, సత్యవతీదేవి ఆలయ ప్రాచీనత్వాన్ని స్థిర పరుచు చున్నాయి. ఇంతటి విశిష్ఠత కలిగిన ఇసుకస్థంభ మంటపాన శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని వైష్ణవ సాంప్రదాయ రీతిలో గురువారం సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేదుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్షేత్రంలోని పౌరాణిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకున్న ఇసుక స్థంభం వద్ద, దేవస్థానం ఆధ్వర్యంలో పాలు పెరుగు, పండ్లు, కాయలు, మొక్కజొన్న కంకులను ఉట్లలో ఉంచి, ఉట్లను ప్రాచీన ఆచారం ప్రకారం కొట్టి పండగ జరిపేం దుకు దేవసా పక్షాన వలసిన ఏర్పాట్లను చేశారు. ఇసుక స్థంభంవద్దకు మంగళవాద్యాలతో అరుదెంచదానికి ముందుగా వర్షం కురిసిన క్రమంలో...దేవాలయ ప్రాంగణంలోనే మునుముందుగా సంప్రోక్షణాది క్రతువులను నిర్వహించారు. అనంతరం వసంతోత్సవ పారాయణం, షోడశోపచార విధివిధాన వేదోక్త పద్ధతిలో ప్రత్యేక పూజలు గావించి, భక్తులకు దైవాశీస్సులందించారు.కా?ర్యక్రమముల ో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్ , వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ , ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు , ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్ , అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్ , రాజగోపాల్ సూపరింటెండెంట్ కిరణ్ , సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ , మరియు అర్చకులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.భక్తి శ్రద్ధలతో భక్తులు, స్థానికులు ఉట్లను పోటీలు పడి కొట్టి, దేవదేవుని ప్రసాదంగా గ్రహించి, అలౌ కిక ఆనందంలో మునిగి తేలారు. ప్రముఖులతో పాటు అధిక సంఖ్యాకులైన భక్తులు పాల్గొన్నారు.



**ఉట్ల పండుగకు దేవస్థానం ఏర్పాట్లు**

ఉట్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వ హించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టింది. క్షేత్రంలోని పౌరాణిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకున్న ఇసుక స్థంభం మంటపం వద్ద, ఎత్తున దేవస్థానం ఆధ్వర్యంలో పాలు, పెరుగు, పండ్లు, కాయలు, మొక్కజొన్న కంకులను ఉట్లలో ఉంచి, ఉట్లను ప్రాచీన ఆచారం ప్రకారం కొట్టి పండగ జరిపేందుకు వలసిన అన్ని ఏర్పాట్లను గావించారు. ఉట్లను కొట్టడం పూర్త య్యాక స్వామి వారి ప్రసాదంను భక్తులకు పంచారు. అంతకు ముందు వేణు గోపాలస్వామి ఆలయంలో సాంప్రదాయక పూజలొనరించారు.

## జిల్లాస్థాయి టిఎల్ఎం మేళాలో

# కిషన్‌రావుపేట యుపిఎస్ ఎంపిక



చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 16 : జగిత్యాల జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన టిఎల్ఎం మేళాలో వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట ఉన్నత ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యు లు నర్మల గంగన్న తెలిపారు. ఈ మేళాలో పాఠశాల ఉపాధ్యా యులు జి మునీంద్ర, సిహెచ్ వనిత పాల్గొనగా జి,మునీంద్ర తయారు చేసిన టిఎల్ఎం జిల్లా స్థాయిలో ఎంపిక కావడంతో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లా విద్యాధికారి రాములుఉపాధ్యా యురాలు జి మునీంద్ర ను అభినందించారు. జిల్లాస్థాయి లో కిషన్ రావు పేట పాఠశాల ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సత్యవతి, ఉపాధ్యాయులు భవాని, వనిత శిరీష,జమున,జై సింగ్, గ్రామస్తు లు అభినందించారు.



## నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ



**చురకలు విలేకరి, రాయికల్,సెప్టెంబర్ 16 :** రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో ప్రతిమ ఫౌండేషన్,జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. మహిళలకు టైలరింగ్, హోమ్ ఎయిడ్ హెల్త్, పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత వసతి,భోజన సౌకర్యంతో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. టైలరింగ్ కోర్సులో చేరడానికి చదవడం రాయడం వచ్చి ఉండాలని,హోం ఎయిడ్ హెల్త్,ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పదవ తరగతి ఉత్తీర్ణులై,వయస్సు 18 నుండి 30 సంవత్సరాల లోపు గల వారు ఈనెల 25వ తేదీలోపు 9963347142 ఫోన్ నెంబర్ కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి



**చురకలు విలేకరి,బీర్‌పూర్, సెప్టెంబర్ 16 :** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి కందుకూరి స్వాతి అన్నారు. మంగళవారం బీర్ పూర్ మండల కేంద్రం లో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతుల తోటలు పరిశీలించి, ఆయిల్ ఫామ్ తోటలలో అంతర పంటల ద్వారా ఆదాయం పొందాలని సూచించారు.ఆయిల్ పామ్ తోటలలో నాలుగు సంవత్సరాలు తర్వాత ఆయిల్ పామ్ దిగుబడి ప్రారంభం అవుతుందని, ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పాక్షిక నీడ అవసరమాయ్యే, కోకో, వక్క,అరటి, బంతి తోటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అర్హులైన రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీ అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో హార్టికల్చర్ ఎక్సటెంక్షన్ ఆఫీసర్ వి. వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మిట్టపెల్లి రామన్న, గణపతి పలు రైతులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వినతి



**చురకలు విలేకరి,రాయికల్,సెప్టెంబర్ 16 :** రాయికల్ పట్టణంలోని మూడో వార్డులో బుదద రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని సీసీ రోడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కు కాలనీవాసులు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. పట్టణం సుందరీకరణం కావాలంటే సిసి రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలే తప్ప నిరుపయోగమైన డివైడర్లపైన డివైడర్లు ఏర్పాటు చేయడం కాదని ప్రశ్నించారు. తాము బురద రోడ్లపై రాకపోకలు కొనసాగిస్తున్నామని ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలోనే సిసి రోడ్ ఏర్పాటు చేస్తానని స్పందించినట్లు కాలనీవాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బన్న సంజీవ్, కాలేశ్వరం రవి,రాస మల్ల రాజయ్య, మామిడిపల్లి రవీందర్,భీమనాతి రాజశేఖర్,గణేష్, అచ్చ అనిల్, సోరపాక శైలజ,కోల గంగమ్మ, కలమడుగు నారాయణ,సందెల రాజేశం,అర్పత్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేశ్వర్ రావు ఆశయాలను నెరవేరుస్తాం

**-హుజురాబాద్‌లో..**
**“సింగాపురం” రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు**
**-తాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ సెప్టెంబర్ 16 :** హుజురాబాద్ ప్రాంత బిడ్డగా, రైతుగా అభివృద్ధికి తాగు నీటికి, సాగునీటి పరంగా, విద్యా పరంగా అనేక సేవలు సింగాపురం పెద్ద దొరగా ప్రసిద్ధి చెందిన మాజీ ఎంపీ దివంగత (వొడితల) రాజేశ్వర్‌రావు అందజేశారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు.మాజీ రాజ్యసభ సభ్యులు రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు మంగళవారం హుజురాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.సైదాపూర్ క్రాస్ రోడ్ లో ఆయన విగ్రహానికి ప్రణవ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాజేశ్వర్ రావు మనుమనిగా తాను ఎంతో గర్విస్తున్నానని,తన తాత ఆశయాలను కొనసాగిస్తూ, విద్య ఉద్యోగ కల్పనలో మొదటి స్థానంలో హుజురాబాద్‌ను నిలబెడతామని అన్నారు.హుజురాబాద్ నియోజకవర్గం లో నాడు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాజేశ్వర్ రావు కృషి చేసారని గుర్తు చేసారు.అయన అందరిని ప్రేమించారని,తనదగ్గరికి వచ్చిన వారికి కాదనకుండా సహాయం చేసారని తెలిపారు.ఆ రోజుల్లోనే ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని, దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారని అన్నారు.నాటి ప్రధాని పివి నరసింహా రావు అనుచరునిగా,బంధువుగా నాటి మైనారిటీ ప్రభుత్వం ఐదేళ్లు విజయ వంతంగా నడిచేందుకు కృషి చేసారని అన్నారు.నాటి పివి చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా,తదనంతరం పివి తీసుకువచ్చిన డా. మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారని, అప్పటి నుండి భారతదేశంలో విదేశీ పెట్టుబడులు రావడం,తద్వారా పరిశ్రమల అభివృద్ధి జరిగి కోట్లాది మందికి ఉద్యోగావకాశాలు రావడం దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టడం జరిగాయన్నారు.పివి, సింగాపురం రాజేశ్వర్ రావులను పనితీరు ఇప్పటికైనా దేశానికి గర్వకారణమని, వారు హుజురాబాద్ ముద్దుబిడ్డలని అన్నారు.ఇక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రావడం తన తాత రాజేశ్వర్‌రావు ఆశయమని,ఇక్కడ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తామని,తద్వారా ప్రజా సేవకు కంకణం కట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మండల స్థాయి టిఎల్ఎం మేళా

**-వీణవంక మండల విద్యాధికారి శోభారాణి**



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 16 :** వీణవంక మండలం లోని వివిధ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల నుండి తెలుగు, ఇంగ్లీష్, గణితం,పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులను బోధించడానికి అవసరమైన బోధనోపకరణాలను మండల పరిధిలోని ఉపాధ్యాయులు అద్భుతంగా తయారు చేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోర్కల్ నందు నిర్వహించిన మండల స్థాయి టిఎల్ఎం మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి సుద్దాల శోభారాణి మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావడానికి లో కాస్ట్ నో కాస్ట్‌తో తయారుచేసిన బోధనోపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటారని తెలియజేశారు. వివిధ పాఠశాలల నుండి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు చాలా తక్కువ ఖర్చుతో ఉపయోగకరమైన బోధనోపకరణాలు తయారు చేశారని ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలియజేశారు.న్యాయ నిర్ణేతలుగా తిరుపతిరెడ్డి, అమరేందర్ శ్రీకాంత్ లు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి,శ్రీనివాస్, శ్రీకాంత్, చంద్రశేఖర రావు,కరుణాకర్ రెడ్డి,నాగిరెడ్డి, మధు,జ్యోతి,విమల,శారద పద్మావతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# కేశవరెడ్డికి ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 16 :** రామగిరి మండలం లోని సెంటినరీ కాలనీకి చెందిన ప్రగతి విద్యా సంస్థల అధినేత మరియు జిల్లా ట్రస్మ అధ్యక్షులు అబ్బ కేశవరెడ్డికి ఘన సన్మానం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నుకో బడినటువంటి ఆబు కేశవరెడ్డి ఘనంగా శాలువాతో కమాన్‌పూర్ మండల కేంద్రంలో గల ప్రైవేట్ పాఠశాల కంఫర్ట్ గ్రామర్ మరియు ఆపిల్ కిడ్స్ పాఠశాల యజమాన్యం ఆర్నకొండ వినయ్ కుమార్ మరియు చదువు వెంకట్ రెడ్డి ఘనముగా సత్కరించడం జరిగింది. గత 30 సంవత్సరాల నుండి విద్యారంగానికి చేస్తున్న సేవ లను గుర్తించి పెద్దపెల్లి జిల్లా కలెక్టర కోయ శ్రీ హర్ష మరియు జిల్లా విద్యాధికారి మాధవి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేశవ రెడ్డి విద్య రంగానికి మరిన్ని సేవలు అందించాలని కమాన్ పూర్ మండల్ ప్రైవేట్ పాఠశా కంఫర్ట్ గ్రామర్ స్కూల్ మరియు ఆపిల్ కిడ్స్ పాఠశాల యజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం వారికి కృతజ్ఞతలు తెలియపరిచారు.

# పోలీస్ స్పోర్ట్స్ పోటీలకు ఎంపికైన డబ్ల్యూ పిసి శ్రీలత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 16 :** కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్లో మహిళ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కూరపాటి శ్రీలత ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ యోగకు ఎంపికయ్యారు.అక్టోబర్ నెలలో 13 నుండి 17వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగబోయే భారత దేశ స్థాయి పోటీలలో పాల్గొనబోతుంది.గత ఫిబ్రవరిలో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో యోగ పోటీలు జరగగా ఆమె రెండో స్థానం సాధించి రజత పథకాన్ని సాధించారు.గతంలో కూడా శ్రీలత ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈసారి మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పథకం సాధించి మన తెలంగాణ రాష్ట్రం తో పాటు మన పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పేరును వ్యాపించేలా బంగారు పతకం సాధించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝ.,ఏఆర్ఏసిపి ప్రతాప్ ఆర్ ఐ శ్రీనివాస్ లు ఆకాంక్షించారు. అలాగే కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ నుండి పనిచేస్తూ జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీలతకు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కౌన్సిలర్ల ఎన్నిక




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి రాష్ట్ర కౌన్సిలర్లుగా చాట్ల ఎంపిపి ఎస్ విలాసాగర్,బాద గోపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేట ఎన్నికయ్యారు.స్థానిక ఎస్టియు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అద్యక్ష,ప్రధాన కార్యదర్శులు రేవోజు సదానందం,మొగిలి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ వారికి జిల్లా శాఖ పక్షాన అభినందనలు తెలుపుతూ,జిల్లా నుండి రాష్ట్రానికి బాధ్యత వహిస్తు జిల్లా వ్యాప్తంగా ఏర్పడ్డ సమస్యలపై నిరంతరం పనిచేయాలని, జిల్లా ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ, సంఘ అభివృద్ధికి,ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పాటుపడాలని అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు,జిల్లా బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూస్వాములను తరిమికొట్టింది కమ్యూనిస్టులే



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 16 :** భాంచంన్ దొర అన్న వారితో బందుకు పట్టించి భూస్వాములను తరిమి కొట్టింది కమ్యూనిస్టులే అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ బస్టాండ్ చౌరస్తాలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడారు.1946 కడివెండిలో దొడ్డి కొమురయ్యను తుపాకీ తూటాలతో కాల్చి చంపారు, 1940 లోనే భూస్వామ్య గుండాలు మహమ్మద్ బంధగీని హత్య చేశారు, పటేల్ సైన్యం విమోచనం చేసిందని బిజెపి చేస్తున్న దుష్ప్రచారం పూర్తిగా అవాస్తమైనది.అమరవీరులకు నివాళులర్పించి సాయుధ పోరాట అమరవీరులు అందించిన ఆశయాల సాధన కోసం ఉద్యమిస్తామని అన్నారు. భూస్వాముల,రజాకార్లనుండి, వేల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఓదెలు,యార.రమేష్,రాజు,సామ రాజేందర్, మేఘనత్,కుమార్,రాజేష్,k. శివ,రాజయ్య, రెడ్డిరాజుల సాగర్. జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతును రక్షించిన కానిస్టేబుల్ సురేందర్

**-అభినందించిన జిల్లా ఎస్ పి మహేష్ బి గితే**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు దేవయ్య మానేరు వాగులో చిక్కుకోగా జిల్లా డిఆర్ఫ్ఫ్ టీంలోని కానిస్టేబుల్ సురేందర్ ధైర్యసాహసంతో తక్షణమే స్పందించి రైతును రక్షించాడు. ఈసందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి మహేష్ బి గితే కానిస్టేబుల్ సురేందర్‌ను శాలువా కప్పి అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ ఆయన చూపిన కర్తవ్య నిబద్ధత, ప్రజాసేవ భావానికి గుర్తింపుగా ప్రశంస పత్రం అందజేసి “ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు లెక్కచేయకుండా పనిచేసే పోలీసు సిబ్బంది సమాజానికి ఆదర్శప్రాయులు అని ఆయన కొనియాడారు.

# రాజకీయ బిక్ష పెట్టిన వారిని దూషిస్తే ప్రజలు సహించరు పుట్ట

## -బహుజనుల ముసుగు ధరిస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, సెప్టెంబర్ 16 :** రాజకీయ బిక్ష పెట్టిన కన్న తండ్రి వంటి శ్రీపాద రావని దూషిస్తే ప్రజలు క్షమించరు అని పుట్ట మధును కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు.అలాగే బహుజన వేషం వేసుకుంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి నియోజకవర్గంలో శ్రీపాదరావు శ్రీధర్ బాబుల శీను బాబుల ఆధ్వర్యంలోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.బారత రాజ్యాంగ రచయిత డా, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధకుడు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని . అలాగే రాజకీయ బిక్ష పెట్టిన శ్రీపాద రావును దూషిస్తే ప్రజలు క్షమించరు అని కాంగ్రెస్ నాయకులు,దళిత నాయకులు కొనియాడారు.కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పాలాభిషేకం చేసి పూలదండలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు.నిన్న అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పేరిట దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు, రాష్ట్ర ఐటి,పరిశ్రమలశాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మరోమారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తమకు కూడా పుట్ట మధు చరిత్ర ఏమిటో తెలియజేసే విధంగా పుస్తకాలు రాయడం వచ్చునని గుర్తేరగాలని హెచ్చరించారు. శ్రీపాద రావు, శ్రీధర్ బాబులు పెట్టిన రాజకీయ బిక్ష కారణంగానే రాజకీయ పదవులు వచ్చాయానే విషయాన్ని విస్మరించి వారిపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అన్నారు. కలిసి మెలిసి ఉన్న పెంచికల్ పేట్ గ్రామంలో ప్రజల మధ్య రాజకీయ చిచ్చు రగిల్చారని ఆరోపించారు.ఇక్కడి స్థానికంగా ఉండే కొందరు నాయకులు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో అందరిని కలుపుక పోకుండా ఒంటిద్దు పోకడతో వ్యవహరించారని ఆరోపించారు.ఇప్పటికైనా గ్రామంలోని నాయకులు తమ పద్ధతి మార్చుకోవాలని హితావు పలికారు. పెంచికల్ పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇరుగురాల శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, చైర్మన్ వైనాల రాజు,పీ.ఏ.సీ. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సయీద్ అన్వర్,ఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్,నాయకులు, ఎం. ఏ రఫీక్,మల్యాల తిరుపతి,కుక్క చంద్ర మౌళి, భూంపెల్లి రాజయ్య, గడప కృష్ణమూర్తి, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, బొల్లపెల్లి శంకర్ గౌడ్, రెబల్ రాజు, లింగాల రాజయ్య, సాగి శ్రీధర్ రావు, మహమ్మద్ యూసుఫ్ లల్లూ, కోల నరేందర్, బాద్రపు శంకర్, నల్లెల్లి శంకర్, మల్యాల మహేష్, ఆడెపు రమేష్, తీగల రాజయ్య, నగునూరి నర్సయ్య గౌడ్, లింగాల కుమార్, వేణు, సదయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానానికి ప్రతిరూపం దక్షిణామూర్తి

## -దక్షిణామూర్తిని శివుని రూపంగా పరిగణిస్తారు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 16 :** దక్షిణామూర్తి అంటే జ్ఞానం మరియు ఆత్మ-సాక్షాత్కారాన్ని ప్రసాదించే గురువు. సకల వేదాల సారమైన జ్ఞానాన్ని మౌనం ద్వారా ఉపదేశించే దేవతగా శివుని ఈ రూపాన్ని పరిగణిస్తారు.దక్షిణామూర్తి మర్రిచెట్టు క్రింద కూర్చుని, చుట్టూ ఉన్న ఋషులకు మౌనంగా జ్ఞానాన్ని ప్రసాదించే రూపంలో కనిపిస్తాడు. ఈయనను సమస్త విశ్వానికి గురువుగా పూజిస్తారు.దక్షిణామూర్తి స్తోత్రం యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలు వర్ణనాతీతం. దక్షిణామూర్తి స్తోత్ర పారాయణం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నమ్ముతారు.

**జ్ఞాన వృద్ధి మరియు ఏకాగ్రత :** ఈ స్తోత్రాన్ని పఠించడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. విద్యార్థులకు ఇది చాలా ప్రయోజనకారిగా భావిస్తారు.

**అజ్ఞాన నాశనం:** ఇది అజ్ఞానాన్ని తొలగించి, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

**అడ్డంకుల తొలగింపు :** జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు, సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుంది. గురు అనుకూలత గురుగ్రహ దోషాలను నివారించడానికి, గురు అనుకూలత పొందడానికి దక్షిణామూర్తిని పూజిస్తారు.

**మోక్ష సాధన :** ఇది జనన-మరణ దుఃఖాలను తొలగించి, మోక్ష మార్గానికి దారి చూపుతుందని నమ్ముతారు.

**సుఖ సంతోషాలు :** ఇంట్లో దక్షిణామూర్తి చిత్రపటం ఉంచి, రోజూ పది నిమిషాలు భక్తితో పూజించడం ద్వారా ఇంట్లో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని చెబుతారు.ప్రతి గురువారం దక్షిణామూర్తి శ్లోకాన్ని పఠించడం విశేష ప్రయోజనాలను ఇస్తుందని చెబుతారు. ఒకవేళ స్తోత్రం చదవలేని వారు దక్షిణామూర్తి చిత్రపటాన్ని చూసి మనస్ఫూర్తిగా నమస్కరించినా కూడా శుభ ఫలితాలు కలుగుతాయి.

# జీర్ణవ్యవస్థకు మేలు చేసే సీతాఫలాలు (కస్టర్డ్ యాపిల్స్)

## -ముదిరాజ్ లకు , గిరిజనులకు వరమైన సీతాఫలాలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 16 :** ప్రకృతి ప్రసాదించిన రుచికరమైన సీతాఫలం,ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది మలబద్ధకాన్ని నివారిస్తుంది.సీతాఫలాలు ప్రతి ఏటా గిరిజనులకు ముదిరాజులకు వరమైంది .ప్రకృతి ప్రసాదించిన అడివిలో చెట్లకు కాచిన సీతాఫలాలను గ్రామీణ ప్రాంతాల నుంచి తెంపుకొని పట్టణ ప్రాంతాలకు వాహనాలపై తరలించి అమ్మకాలను కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటారు.ఒక రుచికరమైన పండు, ఇది కాల్షియం,విటమిన్ సి, ఐరన్, ఫైబర్ వంటి పోషకాలతో నిండి ఉంటుంది.ఈ పండును తినడమే కాకుండా స్వీట్లు,ఐస్‌క్రీములు,జామ్‌లలో కూడా ఉపయోగిస్తారు.అయితే,దగ్గు,జలుబు ఉన్నవారు లేదా నాడీ వ్యవస్థ సమస్యలున్నవారు సీతాఫలాలను తినకూడదు. సీతాఫలంలో కాల్షియం, విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్, పొటాషియం, కాపర్, ఫైబర్ వంటి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. సీతాఫలం ఒక శక్తి కేంద్రంగా ప్రసిద్ధి చెందింది.పండు తినడంతోపాటు,కొన్ని ప్రాంతాల్లో దీనిని ఓషధంగా కూడా ఉపయోగిస్తారు. సీతాఫలం అమృత ఫలాన్ని తలపించే సీతాఫలాన్నే కస్టర్డ్ యాపిల్ అనీ షుగర్ యాపిల్ అనీ పిలుస్తారు.సీతాఫలాలు ఎల్లారెడ్డిపేట వీర్నపెల్లి అటవీ ప్రాంతాలలోని సీతా ఫలాల చెట్లకు విరివిగా కాస్తాయి, వీటిని ఈ ప్రాంతానికి చెందిన గిరి జనులు ముదిరాజులు పట్టణ ప్రాంతాలకు తరలించి అమ్మ కాలుసాగిస్తారు,

# ప్రహరీ గోడ నిర్మాణంలో తీవ్ర జాప్యం

## -వెంటనే నిర్మాణం చేపట్టాలి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గత కొన్ని నెలల క్రితం ప్రహరీ గోడ మంజూరు కాగా భూమిపూజ చేశారు కాని సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. నిత్యం రాకపోకలు, ఇసుక ట్రాక్టర్లు, పశువులు రెండు పాఠశాల మధ్య నుంచి వెళ్లడం వల్ల పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.పాఠశాలకు ఒక వైపు గోడ ఉండటం మరొక వైపు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.సదరు కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదు.వెంటనే అధికారులు చొరవ తీసుకొని ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టి త్వరగాపూర్తి చేయాలని బిఎస్పి మండల ప్రెసిడెంట్ గజ్జెల ప్రశాంత్,గ్రామస్తులు గుంటుకు నరేందర్, లింగంపల్లి శంకర్, లంక నరేందర్, నలిమేటి నాగరాజు,కొయ్యేటి కనకయ్యలు కోరుతున్నారు.


# పిఆర్సి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

## -డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మలక రామకృష్ణారావు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 16 :** పిఆర్సి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్క రామకృష్ణారావు అన్నారు.ఈ మేరకు మంగళవారం డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వివిధ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ ధరలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరగవలసిన పిఆర్సి గడువు ముగిసిన రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే పదోన్నతులతో చీరని ఉపాధ్యాయుల ఖాళీలను తక్షణమే తిరిగి పదోన్నతులు కల్పించాలని పరిమితి లేని ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని హెల్త్ కార్డులు మంజూరు చేయాలని పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శంషుద్దీన్ ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేశ్వరరావు మండల అధ్యక్షుడు సదయ్య ప్రధాన కార్యదర్శి రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్ చోరీ కేసు నమోదు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 :** ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని బంగ్లా ధర్మ గౌడ్ అనే వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ వైర్ చోరి గురైనట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు. గ్రామ శివారులోని తన వ్యవసాయ కులానికి నీరు అందించేందుకు సుమారు 30 వేల రూపాయల విలువగల విద్యుత్ లను అమర్చాడు. ఆదివారం సాయంత్రం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లు చోరీకి గురి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

# మహిళల రక్షణ కోసమే షీ టీంలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 16 :** మహిళల రక్షణ కోసమే షీ టీం లో పనిచేస్తున్నాయి అని షీ టీం ఇన్చార్జి స్నేహలత అన్నారు. మంగళవారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు, పెద్దపెల్లి, హనుమాన్ నగర్ లోని ఇండియన్ మిషన్ హై స్కూల్,విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,గుడ్ టచ్, బ్యాడ్ టచ్,ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, మరియు వాటి నుంచి ఎలా బయట పడటంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని,ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని,అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్ల యితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ మరియు, కరస్పండెంట్ , ధనుంజయరెడ్డి, హెడ్ మాస్టర్ జయరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో కోర్టు ఏర్పాటు చేయండి

**-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ను కలిసిన న్యాయవాదులు**
**-సానుకూలంగా స్పందించిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 16 :** జమ్మికుంటలో కొత్తగా కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు మంగళవారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ కు కోర్టుకు సంబంధించిన పరిస్థితులను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి న్యాయవాదులు సమగ్రంగా వివరించారు. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన 30 మంది న్యాయవాదులు జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాలకు చెందిన న్యాయవాదులు ఆయనను కలిశారు. జమ్మికుంటలో ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. జమ్మికుంట ప్రాంతం నుండి ఎక్కువ కేసులో హుజురాబాద్ కోర్టులో నడుస్తున్నాయని తద్వారా కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జమ్మికుంట అతిపెద్ద పట్టణంగా వ్యాపార కేంద్రంగా ఉందని వారు తెలిపారు. జమ్మికుంట లో డిగ్రీ కళాశాల, అతిపెద్ద మార్కెట్, రైల్వే కనెక్టివిటీ ఉండడంతోపాటు సుమారు 100 గ్రామాలకు కేంద్రంగా ఉందని వారు వివరించారు. జమ్మికుంటలో కోర్టు ఏర్పాటు చేస్తే హుజురాబాద్ కోర్టుపై కూడా కేసుల భారం తగ్గుతుందని అన్నారు. రెవిన్యూ పోలీసు శాఖలకు కూడా కేసుల విషయంలో హుజురాబాద్ కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుందన్నారు. న్యాయవాదుల విజ్ఞప్తికి స్పందించిన వొడితల ప్రణవ్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి జమ్మికుంటలో కోర్టు వచ్చే విధంగా కృషి చేస్తానని న్యాయ వాదులకు హామీ ఇచ్చారు. ప్రణవ్ ను కలిసిన వారిలో న్యాయవాదులు మోలుగూరి సదయ్య, ఏబూసి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్ బాబు, నక్క సత్యనారాయణ, , మొలుగూరి సదయ్య, హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నూతల శ్రీనివాస్, కనకం తిరుపతి, మునజల విజయ్, పింగిలి రమేష్ , సుకన్య, శ్రీరామ్ శిరీష, అబ్బరవేణి రాజు, వంశీకృష్ణ గూడెపు, అప్పని రాజు, పిట్టల రాజేష్, ముంజాల విజయ్, మోరే కళ్యాణ్, గుండ వరప్రసాద్, నవీన్ కుమార్, మారపల్లి శ్రీధర్, దూడపాక శ్రీనివాస్ , తదితరులు ఉన్నారు.

### కార్మిక హక్కుల పరిరక్షణకు

# ఐఎన్టియుసి కట్టుబడి ఉంటుంది



**-ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 16 :** కార్మికుల హక్కుల పరిరక్షణకై ఐఎన్టియుసి కట్టుబడి ఉందని ఆర్జీ 3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐ ఎన్ టి యు సి నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. సమావేశానికి ఆర్జీ త్రి ఏరియాలోని ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘాల ప్రతినిధులు, సింగరేణి ప్రాంతీయ ప్రధాన కార్యకర్తలు హాజరయ్యారు. సమావేశంలో సింగరేణి కార్మికుల సమస్యలు, మైన్స్ లో భద్రతా చర్యలు, కార్మికుల సంక్షేమ పథకాలు, లాభాల వాటా,ఇతర అంశాలపై పిట్ సెక్రటరీలతో మాటలాడి వారికి ఉన్న సమస్యల పరిష్కారానికి చేయవల్సిన పనుల గురించి చర్చించారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐ ఎన్ టి యు సి కట్టుబడి ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.అంతేకాకుండా రాబోయే కార్మిక ఉద్యమాలకు తగిన వ్యూహరచన, యువ కార్యకర్తలకు శిక్షణ, అన్ని మైన్స్ లో ఐ ఎన్ టి యు సి శక్తిని బలోపేతం చేసే అంశాలపై కేంద్ర కమిటీ నాయకులు ఆధ్వర్యంలో ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి కేంద్ర కార్యదర్శులు గడ్డం తిరుపతి యాదవ్,ఎల్లంకి రామారావు ,రాజకుమార్,బిక్ష నాయక్,బ్రాంచ్ కార్యదర్శులు నరెడ్ల శ్రీనివాస్ రావు సత్రం సమ్మయ్య మరియు పిట్ సెక్రటరీలు రామిడ్ల మనోహర్,కె న్ చారి, వెంకటస్వామి, సర్వన్ తేజవత్, కిషన్ నాయక్,సదానందం, నరేష్,రమేష్ ,వివిధ కమిటీ నాయకులు మరియు అన్ని మైన్స్ , డిపార్ట్మెంట్ ప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## పోషణ్ భీ పడాయి భీ మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు



**చురకలు ప్రతినిధి,మెట్పల్లి,సెప్టెంబర్ 16 :** అంగన్వాడి టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాము ఈ శిక్షణ కార్యక్రమానికి మెట్ పల్లి అర్బన్ రూరల్ మరియు ఇబ్రహీంపట్నం మండలం అంగన్వాడీ టీచర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్నారు డే- 1ట్రైనింగ్ లో నవచేతన(0- 3 సం పిల్లల) ప్లే బేస్డ్ లెర్నింగ్ ప్రారంభ బాల్య ప్రేరణ కోసం గృహసందర్శనలు మరియు సంరక్షకులకు శిక్షణ, నవచేతనలో140 యాక్టివిటీస్ గురించి సంరక్షణ యొక్క ప్రధాన భాగాల గురించి ఆధార్ శీలా(3- 6 సం పిల్లలు) పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సమూహ కార్యకలాపాలు,బాల్యవిద్య యొక్క ప్రాముఖ్యత పై సమూహ చర్చ అభివృద్ధి రంగాల పరిచయం 1000డేస్ ప్రాముఖ్యతపై సమూహ చర్చ తల్లి పాల ప్రాముఖ్యత నవజాత శిశువు సంరక్షణ 0- 5 సం పిల్లల బరువులు పై అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సిడిపిఓ కే. మణెమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది ఇట్టి కార్యమంలో రెండు మండలాల అంగన్వాడి టీచర్లు , సూపర్ వైజర్ షమీంసుల్తానా,ప్రతిభ డి పి ఎ ప్రశాంత్,డిఈఓ మనసా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి నాయకులు డాక్టర్ రఘు



**చురకలు ప్రతినిధి,మెట్పల్లి ,మండల వేంపేట్ సెప్టెంబర్ 16 :** బిజెపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మరంపల్లి శ్రీనివాస్ ఈ మధ్యనే మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ రఘు బిజెపి నాయకులు ఏలేటి నరేందర్ రెడ్డి.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 16 :** ఈరోజు తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కొలిపాక రాజమౌళి గారి తండ్రి కొలిపాక మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉల్లెంగుల ఏకానందం ఈ రోజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, బీనపల్లి బాలయ్య, కొలిపాక రామస్వామి, అశోధ అంజయ్య,గుంటి రామచంద్రం,కొలిపాక శ్రీనివాస్, సానగోండ సది,కామెర సంపత్,గుర్రాల వెంకన్న,సానగోండ ఐలయ్య, సుదగోని సదయ్య గౌడ్, మాచర్ల నర్సయ్య,కొయ్యడ సమ్మయ్య, అహ్మద్ హుస్సేన్ అనగోని సంపత్,కెమెరా రాజీరు, కొలిపాక బాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య మంత్రి చేతులచే దివ్యదృష్టి ఆవిష్కరణ



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 16 :** కరీంనగర్ జిల్లా ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడిన దివ్య దృష్టి వీడియో ఆల్బమ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్త లోని తమ నివాసంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ పిల్లలు దివ్య దృష్టి గల. సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను కూడా అలవోకగా పడడం అభినందనీయమని భాష సరిగా ఉచ్చరించలేని ఈ కాలం లో ఇంత స్పష్టంగా రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్ని చ్చిందని అన్నారు.ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్స హించడం ఆదర్శనీయమని అన్నారు.వీడియో ఆల్బమ్ కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్,సంగీతాన్ని అందించిన కె.బి.శర్మ, సంగీత ఉపాధ్యాయురాలు సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీ గౌతమ్‌లను అభినందించారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు అన్నం రవిచంద్ర సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారి గాయకులు సింధుశ్రీ,శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణి రతన్, లోహిత్ లతో పాటు ప్రభుత్వ బదిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా బస్సు ఏర్పాటుచేసి పిల్లలను కరీంనగర్ నుండి హైదరాబాద్ రప్పించి ముఖ్యమంత్రిచే వీడియో ఆల్బమ్ ఆవిష్కరణ చేయించారు. కార్యక్రమ అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలతో కలిసి సచివాలయం సందర్శించారు.

# మత్తుకు ఎవరూ బానిస కాకూడదు

**-యువత దేశానికి మార్గదర్శకంగా మెదలాలి**

**-రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఈగల్ అనే నినాదంతో మత్తును అరికట్టిస్తుంది**

**-మాదకద్రవ్య వ్యతిరేకతపై అవగాహన ర్యాలీ అభినందనీయం**

**-పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి) సెప్టెంబర్ 16 :** మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనను కల్పిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి పెద్ద ఎత్తున యువతతో మసీదు చౌరస్తా, జెండా చౌరస్తా మీదుగా స్థానిక ఎం.బి గార్డెన్స్ వరకు పెద్దపల్లి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆ ర్యాలీలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అనంతరం స్థానిక ఎం.బి గార్డెన్స్ లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాదకద్రవ్యాల నివారణ చర్యలను మరియు మత్తుకు బానిస కాకూడదని ఎమ్మెల్యే విజయ రమణ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ..పెద్దపల్లి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనను కల్పిస్తూ పెద్ద సంఖ్యలో యువతను భాగస్వామ్యం చేస్తూ భారీ ర్యాలీ నిర్వ హించి అవగాహన సదస్సు సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. మత్తుకు ఎవరూ బానిస కావద్దని యువత దేశానికి మార్గదర్శకం గా మెదలాలని యువతకు తెలియ జేశారు.గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ అనే నినాదంతో మత్తును ప్రారదోలడానికి గట్టి సంకల్పంతో పని చేస్తున్నారని అన్నారు. యువత ముఖ్యంగా వారి తల్లిదండ్రులకు గౌరవం కల్పిస్తూ సమాజంలో గొప్ప పేరును సంపాదించాలని తెలిపారు. యువత పెడదారులు పట్టకుండా సమాజంలో ఆదర్శవంతంగా ఉండాలని ఎవరికివారు తమకు మాకెందుకులే అని అనుకోకుండా మాదకద్రవ్యాలపై ఇతరులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు.పెద్దపల్లి నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అలాగే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేపడుతున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలందరికీ వివరించారు. మత్తు అనే పదం అంటేనే భయపడే విధంగా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గౌరవ ఎమ్మెల్యే విజయరమణ రావు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంకూరి అవినాష్, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యాల నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, పెద్దపల్లి డిసీపీ కరుణాకర్, ఎసిపి గజ్జి కృష్ణ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వర్షి సిఐలు ప్రవీణ్, అనిల్, ఎస్సైలు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, టి.ఎన్.జి.వో అధ్యక్షులు బొంకూరి శంకర్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై

# స్పందించని బీజేపీ

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యం లో బీజేపీలో నిర్లిప్తత,నిస్తేజం కనిపిస్తు న్నాయి.ప్రజాసమస్యలపై ఉధృత పోరాటాలు చేయాల్సిన బీజేపీలో జోష్ ఎందుకో కానరావడం లేదు. ఇటీవల హుజురాబాద్ పట్టణంలో భారీ వర్షానికి వరదలు వచ్చాయి. లోతట్టు కాలనీలైన బుడిగె జంగంకాలని, మామిండ్లవాడ, జమ్మికుంట రోడ్డు, కాకతీయ కాలనీ, పద్మ నగర్ తదితర కాలనీల్లో వరద నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బాధితులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ విడివిడిగా కలిశారు. ఆయా కాలనీల్లో పర్యటించారు. కానీ బీజేపీ నాయకులు ఈ సమస్యపై స్పందించలేదనే విమర్శలు వచ్చాయి. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బలంగా తనవాయిస్‌ను వినిపిస్తున్నారు.

**హుజురాబాద్‌లో పర్యటిస్తూ..**

బాధితులను పరామర్శించడం,పలు కార్యక్రమాలకు హాజరుకావడం,అలాగే కల్యాణ లక్ష్మి,చెక్కులు ఇస్తున్నారు. మరో వైపు ప్రణవ్ కూడా జనంలో తిరుగు తున్నారు.అధికార పార్టీ జోష్ నింపు తున్నారు.కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం ప్రజాక్షేత్రంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదనే విమర్శలు సొంతపార్టీ నుండే వినిపిస్తున్నాయి.

**జిల్లా అధ్యక్షుడే కారణమా?**

హుజురాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలానికి చెందిన గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షునిగా ఉన్నారు.ఐతే.. అయన పార్టీ కార్యక్రమాల విషయంలో పెద్దగా ఆసక్తి ప్రదర్శించడం లేదనే విమర్శలు సొంత పార్టీ నుండి వినిపిస్తున్నాయి. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు సతమతం అవుతున్నారు.అయినప్పటికీ ఎక్కడా రైతులను కలిసి బీజేపీ నేతలు సంఘీ భావం ప్రకటించలేకపోయారని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించలేదనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది.ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయం తామే అంటూ రాష్ట్రస్థాయిలో బీజేపీ నేతలు పదేపదే చెప్తున్నా..హుజు రాబాద్‌లో మాత్రం తాము కాంగ్రెస్ బి ఆర్ఎస్‌ల తర్వాతే అన్న చందంగా కాషాయ నేతలు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికంగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ...ఎక్కడా బీజేపీ నేతలు సమ స్యలపై గాని,ప్రజల పక్షానగాని అను కున్న స్థాయిలో మాట్లాడడం లేదనే విమర్శ ఉంది.కొంతమంది జిల్లా నాయకులు మంత్రి బండి సంజయ్ చుట్టూ..తిరుగుతూ పైరవీలు చేసుకుం టున్నారే తప్ప కార్యకర్తలను పట్టించు కోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవు తోంది.మండల, పట్టణ కార్యవర్గాల్లో డెమ్మీ అభ్యర్థులను పెట్టారని,పార్టీకోసం బలంగా పనిచేసే వారిని విస్మరించారనే అభిప్రాయమూ ఉంది.ఏదిఏమైనా.. కీలకమైన హుజురాబాద్ నియోజకవర్గం బీజేపీలో నిస్తేజం నెలకొంది.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

**-పంచాయతీ రాజ్ అధికారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశం**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 16 :** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీరాజ్ అధికారులు ఆదేశించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితితోపాటు వివిధ అభివృద్ధి పనులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇటీవల కురిసిన వర్షాలు,వరదల వల్ల మానకొండూర్ నియోజకవర్గం వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల గురించి ఎమ్మెల్యే అధికారుల నుంచి ఆరా తీశారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తుల విషయమై ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపారా అని ఆయన సమావేశంలో ప్రశ్నించారు. మండలాల వారీగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ రహమాన్, డెప్యూటీ ఈఈలు మంజులాభార్గవి, రవి ప్రసాద్, ఏఈలు సురేందర్ రెడ్డి, ప్రవీణ్, మల్లేశం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.